# అమ్మగూడ

సంతలో తప్పిపోయిన మైదానం

కొన భాగాన

దాక్కున్నవ్ గదనే...

నువ్ నను గన్నవా... లేక నేనే నిను గన్ననా

నీ ఇనుప గుర్రపు నాడా చప్పుడేందే... ఇక్కడ

విలంబిత్

దృతాల నుంచి

సుఖమందుతున్న రాగం పేరేందో...

తెలుసా... లోకానికి

తెలియదు... తెలియదు

వేగ వేగంగా పదునెక్కే...

నీ లోగిలి ముందు

అపశబ్ద నిశ్శబ్దం

వెన్నెల నెగడు

నీ చుట్టూ అంతా... తెగిపడిన జగమంతా

సంధి ప్రకాశం

సగం తెలుపు చీకటి

సగం ఎరుపు చీకటి

కలిసి పిసికిన అమూర్త ముద్ర... నువ్వు

అమ్మగూడా

నన్ను కనకముందు అమ్మ కడుపులోనే జూసిన నిన్ను

డికాషన్ ఛాయ్‌ని

నీ పడమటాకాశంలో వొలికించిందెవరొ చెప్పు

కలివి కోళ్ళ రెక్కల కింద నిన్ను పొదిగిందెవరో చెప్పు

నీదంతా... సుశ్శుప్తి

అల్పసంఖ్యాకపు బాధ

ధ్యానంలోని మై మూలుగు

ఎండలో కందిగింజలు పగిలినట్లు

పగటి గింజ పగిలిపోతుందిక్కడ

బాగోతులోని రందిలాగుందంతా...

కావాలని... కావాలని

లోకాన్ని కాలదన్నిన సత్తువ ఇది

ఎగిరే పిట్ట వాగులో మునిగిన వేకువ

మౌలాలి... చర్లపల్లి... లాలాగూడ

బీనారం... గట్కేసారం...

రైల్ స్టేషన్లన్నీ నీలోకే...

కందిల్లూపుతూ...

ఆగుతూ...

తెగుతూ...

సుతారంగా వొంటరితనం... నిద్ర

గుర గుర గురగుర గురగుర

జీవిలోపల చెయ్యిపెట్టి తిప్పుతున్నట్టు

ఒక అమేయమైన మెర మెర మెర మెర

ఇరానియన్ సినిమా... లాగుందంతా

రీల్‌టైం నుంచి రియల్ టైం నుంచి

రీల్ టైం లోకి

ప్రపంచానికి అర్థం కానిదంతా

వినిపించనిదంతా

తలాంచి ఇక్కడ్నే సేదతీరుతుంది

మంచి నీళ్ళు తాగుతుంది

చెట్ల కింద మూట పెట్టుకుని నిద్రపోతుంది

ఎండ పొడ సరాన పడుతుంది

కంజుపిట్టల అవకాలీ కలల్లో

ఆకరూఫికరూ లేని

ఈ సమస్త సంగీతం

ఒక నిస్సంచారపు... ఖాళీ సీసలో

ఫ్లాట్‌ఫాం చిత్తమంతా చిక్కినట్టు

ఇక్కడ్నే కన్నుల్లోని ఎంప్టీ కుర్చీ వొకటి

కండ్లు తెరిచే నిద్రపోతుంది

ఎవరూ... రారిక్కడ

ఏదీ మాట్లాడదిక్కడ

ఈ మేనం... గులాంగిరి చేసేటోని

కత్తిరా... కవీ

ఎప్పుడు గుచ్చుకుంటుందో తెలియదు

ఎప్పుడు మొక్కు తీసుకుంటదో తెల్వదు

అది...

అమ్ముగూడకే తెలుసు

కావాలంటే...

చప్పుడు విను... తెలుస్తది

దిమ్మడ దమ్మడ దిమ్మడ దమ్మడ

అగో... ప్యాసింజరొస్తుంది

నీ యవ్వ... పక్కకు జరుగు

సిద్ధార్థ

(‘బొమ్మలబాయి’ – 03.05.2005)